"అమ్మా! ఈ జావ కొంచెం వేడి చేసి ఇస్తావా?" అన్నదామె.

ఆవిడను రోజూ చూస్తూనే వుంటాను. వీధి చివర ఉన్న హోటల్ నుంచి గంటకోసారి గ్లాసుతో 'కాఫీ'నో, 'టీ'నో తెచ్చి ఆ చివరి వాటాలోకి తీసుకుపోతూ ఉంటుంది.

స్కూలుకు పోయే ఓ పదిహేనేళ్ళ కుర్రాడు మాత్రం కనపడుతూ ఉంటాడు. ఆవిడను ఈ వయసులో ఇన్నిసార్లు కాఫీ కోసం ఎవరు పంపుతుంటారా అని అనుకున్నాను చాలాసార్లు.

"లోపలికి రండి" అన్నాను.

"చీకటిలో కళ్ళు సరిగా కనపడవమ్మా! లైటు వేస్తే మా అబ్బాయి విసుగ్గా ఉందంటాడు. నిన్ను ఇబ్బంది పెడుతున్నానమ్మా" అందావిడ నొచ్చుకొంటూ.

"ఫరవాలేదు. రండి. ఊరికే వెచ్చజేసి ఇవ్వటం ఏం కష్టం. గేస్ మీద క్షణంలో వేడి చేసి ఇస్తాను." అంటూ ఆవిడను లోపలికి ఆహ్వానించేను. నేను లోపలికి పోయి వచ్చేదాక ఆవిడ వంగిపోయిన నడుంమ్మీద చేతులు వేసుకొని అలాగే నిలబడి ఉంది.

"నాయనమ్మా"

బయటి నుంచి ఆ పిల్లవాడు పిలుస్తున్నాడు.

"మా మనవడమ్మా...... వెళతాను." అందావిడ గిన్నె కొంగుతో పట్టుకొని.

"ఇక్కడే ఉన్నానురా నాన్నా" అంటున్నది. వాకిట్లోకి వచ్చేడు ఆ అబ్బాయి. ఎప్పుడూ నవ్వినట్లు కనపడదు. మా కాంపౌండ్‌లో నాలుగైదు ఇళ్ళున్నాయి. ఆదివారాలు వస్తే పిల్లలు విపరీతమైన అల్లరి చేస్తారు. కానీ ఆ పిల్లవాడు మాత్రం నిశ్చలంగా, నిర్లిప్తంగా అలా చూస్తూ ఆ వరండాలోనే కూర్చుంటాడు. వాడికి ఆవిడ బయటే అన్నం పెడుతుంది. ఆ ఆదివారం మటుకు కాఫీ అవీ తెచ్చి, నీళ్ళు మోసి ముసలమ్మకు సాయం చేస్తాడు. ఆ మొహంలో అంతులేని దిగులు, ఆ వయసులో గంభీరంగా ఉండటం... యిదంతా నాకో పజిల్‌లా కనపడుతుంది.

"నువు పలక్కపోయేసరికి భయం వేసింది...."

ఆ అబ్బాయి ఏడుస్తున్నాడు. నేను వరండాలో లైటు వేశాను.

"ఏమయిందయ్యా?" అన్నాను.

ముసలమ్మ ఆ అబ్బాయిని ఓదారుస్తోంది.

"ఎందుకు నాయనా ఏడుస్తావు....నేనెక్కడికి పోతాను! బాబాయికి జావ కాస్త వెచ్చ జేసి ఇద్దామంటే చీకట్లో కనపడలేదు. లైటు వేస్తే వాడు వద్దన్నాడు." అన్న దామె.

"మళ్ళీ ఏదో రాస్తున్నాడే. నేను లోపలికి వెళ్ళబోతే కర్ర విసిరేయబోయాడు. నేను బయటికొచ్చి పడ్డాను." అన్నాడు ఆ అబ్బాయి.

"మళ్ళీ కొట్టాడట్రా. ఎందుకు వెళతావు నాయనా. ఏముందీ వాడిని చూసేందుకు. చూసి నువు బతుకుతావుట్రా...."

ఆ ముసలమ్మ కూలబడిపోయి ఏడుస్తోంది. ఆ అబ్బాయి ముసలమ్మ చేతిలో గిన్నె అందుకున్నాడు చప్పున.

"నాయనమ్మా, బాబాయికి చెప్పవే. నేను చూస్తానని చెప్పవే. నాకు భయం లేదు. నేను చూడాలి. నన్ను లోపలికి రానిమ్మని చెప్పు."


ముసలమ్మ తెప్పరిల్లింది. చుట్టూ చూస్తోంది. నేను ఒక్క అడుగు ముందుకు వేసి, ఏమయిందని అడిగే లోపునే ఆ ముసలమ్మ బలహీనంగా నవ్వింది.

"వాళ్ళ బాబాయికి జబ్బు చేసింది. అదే వాడి భయం" ఆవిడ గొంతు బొంగురుపోయింది. ఇద్దరూ వెళ్ళిపోయారు. తెల్లారేక ఇంటి ఓనరు అద్దె కోసం వచ్చాడు. చివర గది ముందు కూర్చుని చాలాసేపు మాట్లాడేడు. ఆవిడ పెద్ద పెట్టున ఏడుస్తోంది.

"వాడు చచ్చిపోతాడురా సాంబయ్యా...నేను ఇదంతా ఎట్లా చూసేదిరా. అన్నం తినలేదు. మందులు పుచ్చుకోడు. కాఫీ తప్ప ఏదీ తాగడు. వాడు కృశించి పోయాడు. కావాలని చావు తెచ్చుకుంటున్నాడు. నేనూ ఎప్పుడు చచ్చిపోతాడా అని చూస్తున్నాను. ఎందుకంటే ఈ పడుతున్న నరకం కంటే చావే నయం వాడికి! పసి వెధవను లోపలికి రానివ్వడు. వాడు బయటికి రాడు" ఆవిడ గొల్లుమని ఏడుస్తోంది.

"ఏడవకమ్మా, ఏం చేస్తాం. మనుష్యుల్ని నమ్మేడు వాడు. కళారాధనతో జీవితం మొత్తం గడిపేడు. పెళ్ళీ పెటాకులు లేకుండా ఆ నాటక సమాజం కోసం శ్రమ పడ్డాడు. ఈ రోజు వాళ్ళకి పనికిరాలేదు. నన్నే లోపలికి రానివ్వలేదు వాడు. అద్దె వద్దంటే నవ్వుకోడు. ఇదిగో ఇవి నువ్వే ఉంచుకో. వాడికి చెప్పకు. దేనికో దానికి ఉంటాయి." అంటున్నాడాయన కళ్ళు తుడుచుకుంటూ.

ఆయన్ను అడక్కుండా ఉండలేకపోయాను-



"ఆ ఇంట్లో మనుషులు చాలా చిత్రంగా ఉన్నారు. ఆ పసివాడు ఓ పెద్ద వేదాంతిలా ఉంటాడు. లోపల వాళ్ళెవరూ బయటికి రారు. ఈ పిల్లాడు లోపలికి పోడు. తిండి కూడా ఆ వరండాలోనే తింటాడు- వర్షం వచ్చినా సరే ఆ మూలనే పడుకుంటాడు. నాకు విచిత్రంగా ఉంది" అన్నాను.

"ఆ ముసలమ్మ చెప్పలేదా... నువు మధుసూదన్‌ను ఎరుగుదువు కదా. నాటకాలు వేస్తాడూ...." అన్నాడాయన.

"సినిమా యాక్టర్ కూడా - అతనే కదా?"

"ఆ.... అవును... చూసేనా... ఆ గదిలో మగ్గిపోయేది వాడే. చావుకు సిద్ధమయినాడు. మంచి మైమ్ యాక్టర్. డ్రెస్ కంపెనీ వుంది. చిన్న వయసు నుంచీ ఆ నాటక రంగానికే సర్వస్వం ధారపోశాడు. ఆ పిల్లాడు అన్న కొడుకు. అన్న, వదినె యాక్సిడెంట్‌లో పోయారు. ఆ పిల్లాడంటే ప్రాణం. కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటాడు....."

"అదేమిటి. వాడు లోపలికి వస్తే కొడతాడట. అదీ కర్ర విసిరి......" అన్నాను ఆశ్చర్యంగా.

ఆయన నిట్టూర్చాడు.

"కొట్టడా?! కొట్టక ఏం చేస్తాడు! తన మొహం చూసి పసివాడు దడుసుకుంటాడేమోనని భయం!




వాడికి గొంతు కాన్సర్. ముదిరిపోయి నాలుక బయటికి వచ్చేస్తోంది. పిల్లాడు బాధపడడూ! పాపం.... ఈ రోగం వచ్చాక ఆ నాటక కంపెనీవారికే తన డ్రెస్సుల విషయం అప్పగించాడు. నాటకానికి ఉపయోగించే మేకప్ సామాన్లు, సెట్టింగులు, తెరలు అన్నీ అద్దెకిచ్చి తనకు ఏదో కొంత డబ్బు ఇమ్మని కోరాడు. ముందు బాగానే ఇచ్చారు. వీడికి వ్యాధి ముదిరిపోయి మాట అర్థంకాని స్థితి వచ్చింది. తోటి నటులు, నాటకం కంపెనీవాళ్ళు మోసం చేశారు. ఎవరికి చిక్కినవి వాళ్ళు తీసుకున్నారు. అడిగేందుకు వీడికి గొంతు లేదు. పిల్లవాడు, ముసలమ్మ ఏం చేయగలరు? అలా దారుణంగా మోసం చేసింది వాడిని కళా ప్రపంచమే. ఏదు సమాజం దగ్గరకు పోతే అసహ్యించుకొన్నారట. "ఇలా బయటికి రావద్దు. జనం దడుసుకుంటారు" అన్నారట హేళనగా. ఇన్నేళ్ళ సేవకు ప్రతిఫలం అది. అంతే-వాడికి మనుషులన్నా, ప్రపంచం అన్నా అసహ్యం వేసింది. అలా లోపలికి పోయిన వాడు మళ్ళీ బయటికి మొహం చూపించలేదు. మందులు వేసుకోలేదు. కోరి మృత్యువుని ఆహ్వానిస్తున్నాడు...." సాంబయ్య గారు కళ్ళు తుడుచుకున్నాడు.

నేను నిర్ఘాంతపోయాను.ఎన్నో సభల్లో మధుసూదన్ వ్యాఖ్యాతగా వ్యవహరించటం చూసేను. హాస్యంగా నవ్విస్తూ చాలా చక్కగా మాట్లాడేవాడు. తెల్లని దుస్తుల్లో అందమైన రూపం నా కళ్ళ ముందు మెదిలింది.

'ఎంత దారుణం. మనుష్యులు ఇంత కిరాతకంగా ప్రవర్తించగలరా? కోరి చావుని ఆహ్వానిస్తున్నాడంటేనే అర్థం అయింది....... ఈ ప్రపంచాన్ని మనుష్యలను ఎంత అసహ్యించుకున్నాడో!...కళ్ళ నీళ్ళు ఆపుకోలేక పోయాను. ఆ పిల్లవాడి ఏడుపే వినబడుతోంది.

"బాబాయ్..నాకు భయం లేదు. నీ దగ్గరికి రానీయనా నన్ను. నువు మందులు వేసుకోవూ... నీ దగ్గరకు రాకుండా నేను ఉండలేను. నాయనమ్మ నువు చెప్పవే"

ఆ పిల్లాడి హృదయవిదారకమైన ఏడుపు నన్ను కదిలించివేస్తోంది.

కొందరు తెర ముందు నటిస్తే మరికొందరు జీవితంలోనూ నటించగలరన్నమాట...

నేను నిస్సహాయంగా కూర్చుండిపోయాను.

ఉదయాన్నే నేను నిద్ర లేచేసరికి మైక్ మోగుతోంది. అంతా హడావుడిగా ఉంది. రోడ్డు మీద పెద్ద టెంట్ వేశారు. మైక్ పెట్టారు. చాలా మంది ఆడవాళ్ళు, మొగవాళ్ళు "రఘుపతి రాఘవ రాజారాం ...." అంటూ పాడుతున్నారు. బయటికి పరుగెత్తుకుపోయి చూసాను.

నోటి చుట్టూ ఓ టవల్ కట్టి ఉంది. ఈనెపుల్లలాటి మనిషి ఆకారం నేను భరించలేకపోయాను. ముసలమ్మ, పిల్లవాడు ఎక్కడా కనుపించలేదు. నేను ఆ చివరి నాటాలోకి మొదటిసారిగా అడుగు పెట్టాను. గుండె దడదడ కొట్టుకుంది నాకు. దరిద్రం ఎంత భయంకరంగా ఉంటుందో ఆ ఇల్లు చూస్తే అర్థం అవుతుంది. స్టవ్, రెండు గిన్నెలు, కుండలు తప్ప ఆ ఇంట్లో ఏవీ లేవు. ఆ పిల్లాడు, ముసలమ్మ కూర్చుని ఉన్నారు. ఇద్దరి మొహాల్లో అదే నిర్లిప్తత. మైక్‌లో ఎవరో ఉపన్యాసం ఇస్తున్నారు. "ప్రముఖ వక్త, నటుడు, దర్శకుడు మధుసూదన్ మరణించటం నాటక రంగానికే తీరని లోటు. నలభై ఏళ్ళ జీవితంలో అతను కళా రంగానికి చేసిన సేవ అపూర్వం. ఈ రోజు చాలా దురదృష్టకరమైన రోజు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను".

ఆ పిల్లవాడు అప్పటిదాకా దీక్షగా చదువుతున్న కాగితం వదిలేసి,"నాయనమ్మా"అంటూ ముసలామెను కౌగలించుకొన్నాడు. నేలపై అల్లల్లాడుతున్న కాగితం అందుకొన్నాను.

ముత్యాల్లాంటి అక్షరాలు.

నాన్నా!

నిన్ను, నానమ్మని ఒంటరిగా వదిలేసిపోతున్నాననే నాకు బెంగ. ఈ ప్రపంచం మనది కాదనుకున్నాక, ఈ మనుషులు, ఆప్యాయతలు ఏవీ మనవి కావని తేలిపోయాక ఇందులో బతకటంలో నాకే ఆనందమూ కనపడలేదు. ఎన్నో నాటకాల్లో నటించాను. బహుమతులు అందుకొన్నాను. చుట్టూ నిత్యం జరుగుతున్న అంతర్నాటకం చూడలేకపోయాను. అదే నా పొరపాటు. ఇంత భయంకరమైన ప్రపంచంలో నువు, నానమ్మ ఎలా ఒంటరిగా బతుకుతారో!. ఏడవకండి... బహుశా ఏడవలేరు కూడా. ఎందుకంటే నేను పోగానే మన ఇంటి ముందే గొప్ప నాటకం జరుగుతుంది. మీరే చూస్తారుగా...

మధు

నేను నీరసంగా నడుస్తూ బయటికి వచ్చాను. నిజంగానే బయట గొప్ప నాటకం. గొంతులో దుఃఖం, మాటల్లో సానుభూతి, మొహానికి విచారం-రంగు పులుముకున్న ఎందరో మహానుభావులు ఆ రంగస్థలంపైన కదులుతూ మాట్లడుతూ పూలదండలు వేస్తూ....

నేను అలా చూస్తూ ఉండిపోయాను. నాకు ఏడుపు రాలేదు. పైగా ఈ కదిలే రంగుల బొమ్మలను చూస్తే నవ్వొస్తోంది కూడా. భారీ ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. లారీలో పూలపల్లకీ కట్టారు. నాటక సంఘాల వాళ్ళు, నటులు, దర్శకులు, ఎందరో గొప్పవాళ్ళు దిగులు మొహాలతో వెనక నడుస్తోంటే మధుసూదన్ తన అంతిమ క్రియలకు భారీ ప్రదర్శనతో వెళ్ళిపోతున్నాడు. బతికి ఉండగా తిండికీ, ఆదరణకు నోచుకోని ఆ అభాగ్యుడికి అపూర్వ సత్కారం మరణించేక. చూద్దామన్నా కన్నీటి తెరల్లో నేనేం చూడలేకపోతున్నాను.

*